సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 16 । జూన్ । 2025



విత్తన బంతులతో పచ్చదనం 8లో



అరుదైన ప్రాణులకు ఊపిరి 8లో



మినిస్కస్ రక్షణే కీలకం
సీపీ శంఖబ్రత బాగ్చి 8లో

న్యూస్‌రీల్

నేడు సీఎం రాక

మహారాణిపేట : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం విశాఖ రానున్నారు. విజయవాడ నుంచి ఉదయం 11.40 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 12.10 గంటలకు ఆర్కే బీచ్, కాళీ మాత దేవాలయం, పార్కు హోటల్ జంక్షన్ తదితర ప్రాంతాలను పరిశీలన చేస్తారు. 12.45 నుంచి 1.05 గంటలకు ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం 1.15 గంటలకు నోవాటెల్‌లో యోగా దినోత్సవంపై సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 4 నుంచి 6 గంటల వరకు పీఎం పాలెం వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో పార్టీ కేడర్‌తో సమావేశమవుతారు. సాయంత్రం 6.15 గంటలకు సీతంపేటలో గల టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శిస్తారు. సాయంత్రం 6.55 గంటలకు విమానంలో విజయవాడ బయలు దేరుతారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న సీపీ బాగ్చి, జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం విశాఖపట్నం పర్యటనకు రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం భద్రతా వాహన శ్రేణి ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ ట్రయల్ రన్ విశాఖ విమానాశ్రయం నుంచి ప్రారంభమై నోవాటెల్ హోటల్, ఆర్.కె.బీచ్, ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్, పీఎం పాలెం ప్రదేశాల మీదుగా సాగింది. ముఖ్యమంత్రి పర్యటించే మార్గంలో భద్రతా లోపాలు లేకుండా చూసేందుకు ఈ ట్రయల్ రన్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, ఆర్డీవో శ్రీలేఖ విమానాశ్రయంలో వివిధ శాఖల అధికారులతో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

మహారాణిపేట : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంబంధిత కార్యక్రమాల ఏర్పాట్లు, సమీక్షల నిమిత్తం సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖ వస్తున్న సందర్భంగా ఆ రోజు కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) తాత్కాలికంగా రద్దు చేసినట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. సీఎం పర్యటనలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్ కూడా..

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేసినట్టు జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు.

స్థాయీ సంఘం సమావేశం వాయిదా

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం మధ్యాహ్నం నిర్వహించనున్న స్థాయీ సంఘ సమావేశం వాయిదా వేసినట్టు మేయర్ పీలా శ్రీనివాస్ పేర్కొన్నారు.

చెస్ పోటీల్లో విజేతలు కృష్ణ, సాత్విక



పోటీపడుతున్న కృష్ణ, ఉద్ధవ్

విశాఖ స్పోర్ట్స్: విశాఖ జిల్లా అండర్–15 చదరంగం పోటీల్లో కృష్ణ, సాత్విక విజేతలుగా నిలిచారు. ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జట్టు ఎంపిక పోటీలు నిర్వహించగా ఓపెన్‌లో 146 మంది, బాలికలు 59 మంది పాల్గొన్నారు. ఓపెన్‌లో ఏడు రౌండ్లు నిర్వహించగా బాలికలకు ఆరు రౌండ్లు నిర్వహించారు. ఓపెన్‌లో పి.కృష్ణ ఆరున్నర పాయింట్లతో విజేతగా నిలవగా ఆరేసి పాయింట్లతో ఉద్ధవ్ లక్ష్మణ్, పి.అనిరుథ్ తర్వాత స్థానాల్లో నిలిచారు. బాలికల్లో పి.సాత్విక ఆరు పాయింట్లతో విజేతగా నిలవగా ఎం.దివ్యవర్షిణి, అఫ్రీన్ ఐదేసి పాయింట్లతో తర్వాత స్థానాల్లో నిలిచారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన కృష్ణ, ఉద్ధవ్, సాత్విక, దివ్య జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అంతర్ జిల్లాల అండర్–15 చదరంగం పోటీలు జూలై 12,13వ తేదీల్లో విశాఖలోనే జరగనున్నాయి.

అన్ని శాఖల్లోనూ వసూళ్లు



నకిలీ ఏసీబీ సీఐ లీలలెన్నో.

- నేరుగా, ఫోన్ పే ద్వారా కలెక్షన్లు
- మధురవాడ జెడ్సీ కార్యాలయంలోనూ తిష్ట
- ఏసీబీ కార్యాలయంలో ఓ సీఐ వద్ద బాతాఖానీ
- నగరంలోని మరో విభాగంలో కొలువైన సదరు సీఐ
- వసూళ్లపై ఫిర్యాదుకు అధికారుల వెనుకంజ
- లోతుగా విచారిస్తే మరిన్ని పెద్ద తలకాయలు బయటకు..

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

నకిలీ ఏసీబీ సీఐ సుధాకర్ లీలలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. నగరంలోని కీలక విభాగాలన్నింటిలోనూ అతడు వసూళ్లకు తెగబడినట్టు తెలుస్తోంది. అధికారుల నుంచి నేరుగాను.. ఫోన్ పే ద్వారా కూడా భారీగా వసూళ్లు చేసినట్లు సమాచారం. ఏసీబీ అధికారినంటూ మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి డబ్బులు డిమాండ్ చేయగా.. సదరు సబ్ రిజిస్ట్రార్ నేరుగా ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో సుధాకర్ గుట్టు కాస్తా రట్టయింది. అయనతో పాటు ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌నని ఫోన్‌లో మాట్లాడిన వేరే ప్రాంతంలో పనిచేస్తున్న ఓ మహిళా ఏఆర్ సీఐ పాత్ర కూడా బట్టబయలైంది. అయితే అంతకు ముందుగా మధురవాడలోని జీవీఎంసీ జోనల్ కార్యాలయం (జెడ్సీ)లో రూ. 25 వేల వరకూ వసూలు చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చినట్టు తెలుస్తోంది. మరోవైపు రెవెన్యూ, మైనింగ్, జీవీఎంసీలోని వివిధ విభాగ అధికారుల వద్ద నుంచి కూడా భారీగా వసూలు చేసినట్టు సమాచారం. అంతే కాకుండా గతంలో ఏసీబీలో పనిచేసి... ప్రస్తుతం బదిలీపై నగరంలోనే వేరే కార్యాలయంలో పనిచేసే సీఐకు కూడా సదరు నకిలీ సీఐతో లింకులు ఉన్నట్టు విచారణలో తేలినట్టు సమాచారం. అంతేకాకుండా ఒక కార్పొరేషన్ చైర్మన్‌తో కూడా విమానాల్లో విదేశాలకు సంచరించినట్టు ఇప్పటికే ఫొటోలతో కూడిన ఆధారాలతో తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు లోతుగా విచారిస్తే మరిన్ని పెద్ద తలకాయల పేర్లు బయటకు వస్తాయనే అభిప్రాయం మాత్రం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సీఐతో మాటా మంతీ...!

గతంలో ఏసీబీలో పనిచేసే సమయంలో ఓ సీఐ కూర్చునే రూమ్‌కు రెగ్యులర్‌గా సదరు నకిలీ ఏసీబీ సీఐ వచ్చేవాడని ఏసీబీ కార్యాలయంలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు విశాఖపట్నంలోనే వేరే విభాగంలో పనిచేసే సదరు సీఐ రూమ్‌లో గంటల తరబడి ఇద్దరూ మాటామంతీ జరిపేవారని సమాచారం. ఆ సమయంలో కూడా ఏసీబీకి వచ్చే ఫిర్యాదులు కాస్తా లీకయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా సుధాకర్‌తో పాటు పట్టుబడి సస్పెండైన మహిళా సీఐకు... ఏసీబీలో గతంలో పనిచేసిన సీఐకు కూడా మంచి సంబంధాలే ఉండేవని సమాచారం. ఈ కోణంలో కూడా సుధాకర్‌కు గతంలో ఏసీబీలో పనిచేసే సీఐ సహకరించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాకుండా విద్యుత్ శాఖలో పనిచేసే మరో ఉద్యోగికి కూడా ఈ నకిలీ ఏసీబీ సీఐ బాగా పరిచయస్తుడని తెలుస్తోంది. మొత్తంగా నగరంలోని అనేక విభాగాల అధికారులతో ఎంతో చనువుగా ఉంటూ... అవినీతిపరుల జాబితాను సేకరించి వసూళ్లకు తెగబడ్డారని అర్థమవుతోంది. అయితే, అంతులేని ఈ నకిలీ ఏసీబీ సీఐ వ్యవహారంలో పోలీసుల విచారణ లోతుగా సాగడం లేదనే విమర్శలు మాత్రం వినిపిస్తున్నాయి.

లోతైన విచారణ ఏదీ...!

వాస్తవానికి నకిలీ ఏసీబీ సీఐ వ్యవహారంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. అయితే, లోతుగా విచారణ జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నకిలీ ఏసీబీ సీఐకు ఫోన్ పే చేసిన వారిని విచారించినప్పటికీ.. తమకేమీ సంబంధం లేదన్నట్టుగా పోలీసుల ముందు బుకాయిస్తున్నట్టు తెలుస్తోంది. తమను బెదిరించి వసూళ్లు చేశారనే కోణంలో కూడా ఎవరూ ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేదని పోలీసువర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, అధికార పార్టీకి చెందిన ఓ కార్పొరేషన్ చైర్మన్‌తో పాటు పలువురు పోలీసులకు, వివిధ విభాగాల అధికారులకు కూడా మంచి సంబంధాలు ఉండటమే కారణమని తెలుస్తోంది. ఆయా ఫొటోలు కూడా ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో వైరలవుతున్నాయి. అయినప్పటికీ పోలీసులు మాత్రం మిన్నకుండిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతులేకుండా సాగిన నకిలీ ఏసీబీ సీఐ వసూళ్ల కథలో అనేక మంది ఆయనను నేరుగా కలిసి మామూళ్లు ఇవ్వడమో.. ఫోన్ పే ద్వారా చెల్లింపులు చేసిన వారే కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో లోతుగా విచారణ జరిపితే అందరి బాగోతాలు బయటపడతాయనే ఆందోళనే కారణమనే విమర్శలున్నాయి.

20న విశాఖకు ప్రధాని మోదీ

మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం –2025లో పాల్గొనేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 20న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి 20న సాయంత్రం 6.50 గంటలకు విశాఖ చేరుకుని అక్కడి నుంచి ఐఎన్ఎస్ డేగాకు వెళ్తారు. నౌకాదళ అతిథి గృహంలో రాత్రి బస చేస్తారు. 21న ఉదయం 6.30 నుంచి 7.45 వరకు ఆర్కే బీచ్‌లో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగిశాక ఉదయం 11.50 గంటలకు ఢిల్లీకి ప్రధాని తిరుగు ప్రయాణం కానున్నారు.

అస్సాం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేడు రాక

మహారాణిపేట: అస్సాం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట రవి సోమవారం విశాఖకు వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి సోమవారం ఉదయం 7.45 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌కు వెళ్లి, అక్కడ కొద్దిసేపు బస చేస్తారు. మధ్యాహ్నం ఇంక్యుబేషన్ సెంటర్, ఐటీ సెజ్‌లను పరిశీలిస్తారు. అనంతరం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)ను సందర్శిస్తారు. సాయంత్రం 6.15 గంటలకు విమానంలో ఢిల్లీకి తిరిగి బయలుదేరుతారు.

ఎస్జీటీలు నేడు పాఠశాలల్లో చేరాలి

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో బదిలీ అయిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు వారికి కేటాయించిన కొత్త స్థానాల్లో సోమవారం చేరాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ స్పష్టం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఈ నెల 10 నుంచి 14 వరకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేసిన సంగతి తెలిసిందే. మొత్తం 2,782 మంది ఎస్జీటీలు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా.. వారిలో అర్హతను బట్టి 2,461 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి, బదిలీ చేసినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ విజయవంతం చేసిన ఉమ్మడి విశాఖ జిల్లాల విద్యా శాఖాధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టింగ్ కోసం ప్రదక్షిణలు

- వైద్య ఆరోగ్య శాఖలో సిఫార్సుల జోరు
- 19 నాటికి బదిలీ ప్రక్రియ పూర్తికి ఆదేశం
- సిటీలో పోస్టింగుల కోసం బేరాలు?
- ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు వచ్చేందుకు యత్నాలు

మహారాణిపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖలో బదిలీల ప్రక్రియ వేగవంతమైంది. ఈ నెల 19వ తేదీని తుది గడువుగా నిర్ణయించడంతో కీలకమైన, అనుకూలమైన పోస్టింగులను దక్కించుకోవడానికి వైద్యులు, అధికారులు, సిబ్బంది రాజకీయ పైరవీలను ముమ్మరం చేశారు. నగరంలో పాతుకుపోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దీంతో బదిలీల ప్రక్రియలో పారదర్శకత లోపిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా.. ఐదేళ్లకు పైగా ఒకే చోట పనిచేస్తున్న వారిని బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే నగరంలోని కీలక స్థానాల్లో ఉన్న వైద్యులు తమ సీట్లను వదులుకోవడానికి ఇష్టపడటం లేదు.

కేజీహెచ్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ మానసిక వైద్యశాల, రాణి చంద్రమణి దేవి ఆర్థోపెడిక్ ఆస్పత్రి వంటి ప్రధాన టీచింగ్ ఆస్పత్రుల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అలాగే వైద్య ఆరోగ్య శాఖలో సూపరింటెండెంట్లు, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యులు, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులు, ఇతర అధికారులు సిఫార్సు లేఖల కోసం తమ ప్రయత్నాల్లో నిమగ్నమై ఉన్నారు. నగరంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారు ఏదో సాకుతో ఇక్కడి నుంచి వెళ్లకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో జోన్ పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారు నగరంలో పోస్టింగ్ దక్కించుకోవడానికి తాపత్రయ పడుతున్నారు. అల్లూరి జిల్లా నుంచి నగరంలోకి రావడానికి కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి భారీగా సిఫార్సు లేఖలు వచ్చినట్లు తెలుస్తోంది. అనకాపల్లి జిల్లాలోని కొన్ని పీహెచ్‌సీల నుంచి నగర పరిధిలోకి రావడానికి పోస్టింగ్‌లకు ఎంత ఖర్చు చేయడానికైనా సిద్ధమవుతున్నట్లు వైద్య వర్గాల్లో చర్చ జరుగుతోంది. విశాఖలో పని చేస్తున్న వైద్యులను ఏజెన్సీకి పంపడం, అక్కడ పని చేస్తున్న వారిని, అనకాపల్లిలో పనిచేస్తున్న వారిని విశాఖకు తీసుకురావడంపై కూడా చర్చ జరుగుతోంది. అలాగే విశాఖలో పనిచేస్తున్న పలువురు వైద్యులను ఇతర ప్రాంతాలకు పంపాలని డీఎంహెచ్‌వో, ఆర్డీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

తెరవెనుక మంత్రాంగాలు : వాస్తవానికి ఈ బదిలీల ప్రక్రియను ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నిర్వహించాల్సి ఉంది. కానీ ఆశావహులు కూటమి ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునేందుకు వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు లేఖల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధుల వ్యక్తిగత సహాయకులు, కుటుంబ సభ్యులతో బేరసారాలకు దిగుతున్నారని, పోస్టింగులను బట్టి ధర నిర్ణయించి, డబ్బు చేతులు మారాకే సిఫార్సులు అందుతున్నాయని బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి కార్యాలయాలకు ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి భారీ సంఖ్యలో సిఫార్సు లేఖలు అందినట్లు సమాచారం. కేజీహెచ్‌లో 59 మంది, డీఎంహెచ్‌వో పరిధిలో 284 మంది, ప్రాంతీయ కార్యాలయం పరిధిలో 979 మంది ఐదేళ్లు దాటిన వారు, రిక్వెస్ట్ లేఖలు పంపిన వైద్యులు, ఉద్యోగులు, అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. రాజకీయ ఒత్తిళ్లను తట్టుకొని నిబంధనల ప్రకారం బదిలీలు పూర్తి చేయడం అధికారులకు కత్తిమీద సాములా మారింది.

ఏడాది పాలనలో అంతా మోసమే..!

- రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబర్ గొల్ల బాబూరావు
- కూటమి ప్రభుత్వ ఏడాది వైఫల్యాలపై కేకే రాజు ఆధ్వర్యంలో వెన్నుపోటు పుస్తకావిష్కరణ



కూటమి ఏడాది పాలన వైఫల్యాలపై బుక్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, దేవన్‌రెడ్డి, మొల్లి అప్పారావు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నేతలు

సాక్షి, విశాఖపట్నం : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఓ నమ్మకం.. చంద్రబాబు అంటే మోసానికి మారుపేరు అని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గొల్ల బాబూరావు అన్నారు. ఆదివారం మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వైఫల్యాలపై వెన్నుపోటు పుస్తకాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వాసుపల్లి గణేష్‌కుమార్, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, దేవన్‌రెడ్డితో కలిపి ఆయన ఆవిష్కరించారు. ముందుగా బి.ఆర్.అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొల్ల బాబూరావు మాట్లాడుతూ పేద ప్రజలను మోసం చేయడం, అక్రమాలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు సంక్షేమ పథకాలు ఇవ్వకుండా కాలయాపన చేయడమే కాకుండా.. ఇచ్చిన ఒకటి రెండు పథకాల్లో కూడా కోతలు విధిస్తున్నారని మండిపడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదల ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని, అవన్నీ ప్రజలు గుర్తుచేసుకుంటున్నారన్నారు. పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబు వైఫల్యం చెందారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదిలోనే అన్ని పథకాలను అమలు చేస్తే.. నేటి కూటమి ప్రభుత్వంలో ఏడాది పూర్తయినా ఒక పథకం కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. టీవీ ఛానళ్లు, పత్రికలను చుట్టూ పెట్టుకుని ప్రతీ రోజూ అబద్ధపు కథనాలు రాస్తున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాలు, హామీల గురించి ఎవరైనా మాట్లాడితే కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారు.

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని హరిస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీని రబ్బర్ స్టాంప్‌లా చేస్తుందని, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంపై ఏడాదిలో పూర్తి వ్యతిరేకత పెరిగిందని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. కార్యకర్తలెవరూ నిర్లక్ష్యంగా ఉండకూడదు.. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, డిప్యూటీ మేయర్ కె.సతీష్, పార్టీ కార్యాలయం పర్యవేక్షకులు రవిరెడ్డి, ముఖ్య నాయకులు పేర్ల విజయచందర్, ఉడా రవి, రొంగలి జగన్నాథం, గొలగాని శ్రీనివాస్, జహీర్ అహ్మద్, నడింపల్లి కృష్ణంరాజు, రవిరాజు, ఉపాధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు, చెన్నా జానకిరామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లు శంకరరావు, ద్రోణంరాజు శ్రీవాత్సవ, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, శశికళ, బిపిన్ కుమార్, జిల్లా అనుబంధ అధ్యక్షులు పేడాడ రమణి కుమారి, భర్కత్ అలీ, పులగం కొండారెడ్డి, పీలా జగదీష్, ఎస్.ప్రసాదరావు, రామిరెడ్డి, బోండా ఉమామహేశ్వరరావు, దేవరకొండ మార్కండేయులు, రాష్ట్ర, జిల్లా పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు దొడ్డి కిరణ్, కాళిదాస్‌రెడ్డి, అల్లంపల్లి రాజబాబు, కిరణ్ రాజు, పల్లా దుర్గారావు, మంచా నాగమల్లీశ్వరి, కొణతాల రేవతిరావు, జె.నాగేంద్ర, పద్మ, నీలి రవి, బి.పద్మావతి, శ్రీదేవి వర్మ, శ్రీనివాస్ గౌడ్, కొట్యాడ సూర్య తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

- భారీగా జనం తరలింపునకు ఏర్పాట్లు
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లోనే బీచ్‌రోడ్డుకు రావాలి
- కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో ఎమ్మెల్యేలు

మహారాణిపేట: బీచ్‌రోడ్డులో ఈ నెల 21న జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ హాజరవుతున్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సూచించారు. బీచ్‌రోడ్డులో యోగా దినోత్సవం ఏర్పాట్లపై నగర ప్రజాప్రతినిధులతో ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ ఈ వివరాలు వెల్లడించారు. ప్రజలు ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాటు చేసిన బస్సులు, ఆటోలు, టాటా మ్యాజిక్ వంటి వాహనాల్లో మాత్రమే బీచ్‌రోడ్డులోని తమకు కేటాయించిన ప్రాంతానికి చేరుకోవాలని, ప్రైవేట్ వాహనాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

ప్రజల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన, గుర్తించిన ప్రాంతాలకు ప్రజలను సకాలంలో తరలించడం ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. ఆయా నియోజకవర్గాల నుంచి ఉదయాన్నే బస్సులు బయలుదేరేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ప్రతి వార్డు సచివాలయానికి కేటాయించిన ప్రాంతం గురించి ఇప్పటికే సమాచారం అందించామని, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకుని ప్రజలు తెల్లవారుజామున ఆ ప్రాంతానికి చేరుకునేలా చూడాలని కోరారు. బస్సులకు వార్డు సచివాలయం కార్యదర్శులను ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నామని, పికప్, డ్రాపింగ్ పాయింట్ల వివరాలతో కూడిన బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

2,185 బస్సులు సిద్ధం: ప్రజలను తరలించేందుకు జిల్లాలో మొత్తం 2,185 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. వీటికి అదనంగా ఆటోలు, టాటా ఏస్, మ్యాజిక్ వంటి వాహనాల్లో కూడా తరలింపు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ బస్సులన్నీ 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకే ఆయా ప్రాంతాలకు చేరుకుంటాయన్నారు.

ఉచితంగా టీ షర్ట్‌లు, మ్యాట్‌లు, స్నాక్స్

యోగా కార్యక్రమంలో పాల్గొనే వారందరికీ ఉచితంగా టీ షర్ట్‌లు, మ్యాట్‌లు అందజేస్తామని కలెక్టర్ చెప్పారు. అలాగే స్నాక్స్ ప్యాకెట్లు అందిస్తామన్నారు.

పార్కింగ్ కేటాయింపులు

విశాలాక్షినగర్ వరకు ఉన్న బీచ్‌రోడ్డును నగరంలోని వివిధ ప్రాంతాల ప్రజలకు కేటాయించారు. పెందుర్తి, అనకాపల్లి ప్రాంతాల వారికి లా కాలేజ్ రోడ్డు, విజయనగరం జిల్లా వారికి మధురవాడ ఐటీ సెజ్ ప్రాంతం, శ్రీకాకుళం వారికి తిమ్మాపురం నుంచి భీమిలి వరకు మార్కింగ్ చేశారు. ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో 600 మంది పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముందురోజు నగరానికి చేరుకుంటారని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమార్ రాజు, పి.గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని కార్యక్రమానికి పైసలేవ్! 8లో

పెళ్లయిన నెల రోజులకే మృత్యు ఒడికి..

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల దుర్మరణం



వివాహ సమయంలో సాయి, శాలిని



విగత జీవులుగా భార్యాభర్తలు శాలిని, సాయి

గాజువాక: వివాహమైన నెల రోజులకే ఒక జంట మృత్యు ఒడికి చేరింది. కాళ్ల పారాణి ఆరకముందే విధి ప్రమాద రూపంలో కబళించింది. నగరంలో సరదాగా షికారు చేసి వద్దామనుకొని బయల్దేరిన కొత్త జంట రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైంది. గాజువాక ట్రాఫిక్ పోలీసులు అందించిన వివరాలివి..

కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన జొన్నాడ సాయి(27), పెదగంట్యాడ మండలం గంగవరం గ్రామానికి చెందిన శాలిని (25) గాజువాకలోని యాపిల్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్లుగా పని చేస్తున్నారు. వీరిద్దరూ ప్రేమించుకొని నెల రోజుల కిందట పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం శ్రీహరిపురంలో ఒక అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం ల్యాబ్‌కు సెలవు కావడంతో షికారు కోసం నగరంలోకి వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ములగాడ మీదుగా పోర్టు రోడ్‌లోని మారుతీ సర్కిల్ వద్ద వెనుకనే వస్తున్న ఒక ట్రాలర్ వారిని ఢీకొని ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో సాయి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తీవ్ర గాయాలపాలైన శాలినిని షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స ప్రారంభించే సమయానికి మృతి చెందిందని పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు సీఐ కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ఇదే రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయిల్ ట్యాంకర్ కింద పడి ఇద్దరు నేవీ వైద్యులు దుర్మరణం పాలైన సంగతి తెలిసిందే.. 24 గంటల వ్యవధిలో నలుగురు మృత్యువాత పడటం.. వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది.


రింగ్‌టైల్డ్ లెమూర్స్

అరుదైన ప్రాణులకు ఊపిరి

అంతరించిపోతున్న జాతుల పునరుత్పత్తి

జూలో 46 ప్రాణులకు జన్మనిచ్చిన వన్యప్రాణులు

ఆరిలోవ: వాతావరణ కాలుష్యం, వేటగాళ్ల ఉచ్చులు, క్రూర మృగాల దాడి, మారుతున్న పర్యావరణ పరిస్థితుల కారణంగా ఎన్నో వన్యప్రాణి జాతులు అంతరించిపోయే దశకు చేరుకున్నాయి. ఒకప్పుడు సజీవంగా ఉన్న జాతులు నేటి తరానికి టీవీల్లో, పుస్తకాల్లో మాత్రమే కనిపించే పరిస్థితి నెలకొంది. వాటి ఉనికే ప్రశ్నార్థకమవుతున్న ఈ తరుణంలో నగరంలోని ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కు ఒక ఆశాకిరణంగా నిలుస్తోంది. అంతరించిపోతున్న అరుదైన వన్యప్రాణులకు పునరుత్పత్తి కేంద్రంగా మారి, వాటి వంశాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇక్కడి సంరక్షకుల కృషితో గత ఎనిమిది నెలల్లోనే 12 అంతరించిపోతున్న జాతులకు చెందిన 46 పిల్లలు ఊపిరిపోసుకున్నాయి. వన్యప్రాణి సంరక్షణలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించాయి.


చుక్కల జింక పిల్ల


అడవి కుక్క పిల్లలు


తల్లితో కనుజు పిల్ల

అరుదైన జీవులకు అభయం


తల్లి పాలు తాగుతున్న బార్కింగ్ డీర్ పిల్ల

విశాఖ జూ పార్కు ఇప్పుడు కేవలం జంతు ప్రదర్శనశాల మాత్రమే కాదు.. అంతరించిపోతున్న జీవజాతులకు ఒక సురక్షితమైన ఆవాసం, పునరుత్పత్తి కేంద్రం. వన్యప్రాణి సంరక్షణ చట్టం–1972 ప్రకారం షెడ్యూల్–1 జాబితాలోని అనేక జీవులు ఇక్కడ విజయవంతంగా తమ సంతతిని పెంచుకుంటున్నాయి. జింక పిల్లలు, అడవి దున్నలు, అడవి కుక్కల పిల్లలు, నీల్‌గై, రెడ్‌నెక్డ్ వాలబీ, బెంగాల్ ఫాక్స్, ఇండియన్ గ్రే వోల్ఫ్, రింగ్‌టైల్డ్ లెమూర్స్ వంటి జాతులకు చెందిన చిట్టి ప్రాణులు తమ ఎన్‌క్లోజర్లలో తల్లుల వెంట ఉత్సాహంగా తిరుగుతూ సందర్శకులను అలరిస్తున్నాయి. ఈ అద్భుతమైన దృశ్యాలు జూకి వచ్చే వారికి కనువిందు చేయడమే కాకుండా, అంతరించిపోతున్న జాతులను పరిరక్షించడం ఎంత అవసరమో తెలియజేస్తున్నాయి. వెటర్నరీ వైద్యులు, యానిమల్ కీపర్ల నిరంతర పర్యవేక్షణలో ఈ ఘనత సాధ్యమైంది.

8 నెలలు.. 46 బుల్లి ప్రాణులు

గడిచిన ఎనిమిది నెలల కాలంలో ఇందిరా గాంధీ జూ పార్కులో 12 రకాల వన్యప్రాణులకు 46 పిల్లలు పుట్టాయి. ఇందులో అడవి కుక్కలు–14, కృష్ణ జింక (రాష్ట్ర జంతువు) –9, చుక్కల జింక–7, కనుజు–5, నీల్ గై–3, బార్కింగ్ డీర్–2, మౌస్ డీర్–1, బెంగాల్ ఫాక్స్–1, ఇండియన్ గ్రే వోల్ఫ్–1, అడవి దున్న (బైసన్)–1, రెడ్–నెక్డ్ వాలబీ–1, రింగ్‌టైల్డ్ లెమూర్–1 ఉన్నాయి.


తల్లితో నీల్‌గై పిల్ల


తల్లి పాలు తాగుతున్న బైసన్ దూడ


రాయిపై కూర్చున్న వోల్ఫ్


తల్లి పాలు తాగుతున్న కృష్ణ జింక పిల్ల

అంతరించిపోతున్న జాతుల విశేషాలివి..

ఈ జూలో పునరుత్పత్తి అవుతున్న కొన్ని ముఖ్యమైన అంతరించిపోతున్న జాతులు, వాటి ప్రత్యేకతలు ఇప్పుడు తెలుసుకుందాం..

- **అడవి కుక్కలు(ఆసియాటిక్ వైల్డ్ డాగ్స్):** ఇవి వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లోని షెడ్యూల్–1 కిందకు వస్తాయి. ఇందిరా గాంధీ జూ పార్కులో వీటి పునరుత్పత్తి కేంద్రం ఉంది. వీటి ఎత్తు సుమారు 50 సెం.మీ., శరీరం పొడవు 90 సెం.మీ., తోక పొడవు 40–45 సెం.మీ. ఉంటుంది.
- **కృష్ణ జింక(బ్లాక్‌బక్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జంతువుగా గుర్తింపు పొందిన ఈ జింకలు, తమ మెలితిరిగిన కొమ్ములతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. కృష్ణ జింక షెడ్యూల్–1 జాబితాలో ఉంది
- **మూషిక జింక(మౌస్ డీర్):** షెడ్యూల్–1 జాబితాలోని ఈ జింక శరీరం పొడవు 50–60 సెం.మీ., బరువు 3–4 కిలోలు ఉంటుంది. ప్రపంచంలోని అతి చిన్న జింక జాతులలో ఇది ఒకటి. చూడటానికి చిన్నగా, సున్నితంగా ఉండే ఈ జీవి కూడా షెడ్యూల్–1 జాబితాలో ఉంది.
- **కనుజు :** ఇది కూడా షెడ్యూల్–1 జాబితాలో ఉంది. మగ కనుజులకు చెట్ల కొమ్మల మాదిరిగా ఉండే కొమ్ములు 3.5 అడుగుల పొడవు వరకు పెరుగుతాయి.
- **నీలి ఎద్దు(నీల్‌గై):** ఆసియా జింక జాతులలో అతి పెద్దదైన నీల్‌గై షెడ్యూల్–2 జాబితాలో ఉంది. దీని గొంతు భాగం తెల్లగా ఉంటుంది. మగ నీల్‌గైకి 13 సెం.మీ. జుట్టు ఉంటుంది. ఆడవి 200 కిలోలు, మగవి 250 కిలోల వరకు బరువు వరకు పెరుగుతాయి.
- **రెడ్ నెక్డ్ వాలబీ:** ఈ జాతి జీవుల పునరుత్పత్తి ఎంతో ఆసక్తికరం. రెడ్‌నెక్డ్ వాలబీ గర్భం దాల్చిన 30 రోజుల్లో పిల్లకు జన్మిస్తుంది. తర్వాత ఆ పిల్ల తల్లి పొట్ట కింద సంచిలో సుమారు 7 నెలల పాటు పెరిగి, తల్లి పాలు తాగుతుంది. 12 నెలల తర్వాత స్వతంత్రంగా జీవించడం మొదలుపెడుతుంది.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు



జూ పార్కులో వన్య ప్రాణుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఇటీవల పునరుత్పత్తి అయిన పలు రకాల జాతుల పిల్లలను ఇక్కడ సంరక్షకులు, జూ వెటర్నరీ వైద్యులు, సిబ్బంది, యానిమల్ కీపర్లు ప్రత్యేక శ్రద్ధతో సంరక్షిస్తున్నారు. అంతరించిపోతున్న జాతుల సంతతి జూలో గణనీయంగా పెరుగుతోంది. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం వీటికి ఎలాంటి హాని కలిగించినా చట్టరీత్యా నేరమవుతుంది.

– జి.మంగమ్మ, జూ క్యూరేటర్

'ప్రధాని' కార్యక్రమానికి పైసల్లేవ్!

- ఆర్భాటమే గానీ..నిధులివ్వని కూటమి సర్కార్
- 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం
- ప్రధాని మోదీ, ఇతర ప్రముఖుల రాక
- ఈ వేడుకల నిర్వహణకు రూ.75 కోట్ల అంచనా
- యోగా భారమంతా స్థానిక సంస్థలకే!


బీచ్‌రోడ్డులో జరుగుతున్న ఏర్పాట్లు

మహారాణిపేట: జిల్లాలో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని(యోగాంధ్ర) అంగరంగ వైభవంగా, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లక్ష్యంగా నిర్వహించాలని నిర్ణయించినా.. అందుకు అవసరమైన నిధుల కోసం అధికార యంత్రాంగం తీవ్రంగా కుస్తీ పడుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి మరో ఐదు రోజులే సమయం ఉన్నప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని తెలుస్తోంది.

రూ. 75 కోట్ల అంచనా.. సాయం సున్నా!

ఆర్.కె.బీచ్ నుంచి భీమిలి వరకు ఏకంగా ఐదు లక్షల మందితో యోగాసనాలు చేయించి గిన్నిస్ రికార్డు నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కార్యక్రమ నిర్వహణ మీద సమీక్షలు, ప్రాంతాల పర్యటనలు జరిగాయి. ఈ కార్యక్రమానికి సుమారు రూ.75 కోట్ల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. అయితే ఇంతటి భారీ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక చేయూత అందలేన్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఒక లేఖ పంపినప్పటికీ, ఆ నిధులు మాత్రం ఇప్పటికీ విడుదల కాలేదని సమాచారం. దీంతో మొత్తం ఆర్థిక భారం జీవీఎంసీ, వీఎంఆర్డీఏలపై పడుతోంది. బీచ్‌రోడ్డులో 500 కంపార్ట్‌మెంట్ల నిర్మాణం వంటి పనులను ఈ సంస్థలు తమ నిధుల నుంచే చేపడుతున్నాయి. మొత్తానికి యోగా భారమంతా స్థానిక సంస్థలపైనే పడుతోంది..

కేంద్రం ఇచ్చినా.. రాష్ట్రం చేయూతనివ్వదే..

యోగాలో పాల్గొనే వారికి కేంద్ర ప్రభుత్వం మ్యాట్లు, టీ షర్ట్స్ ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. ముందు అనుకున్న ప్రకారం రెండు లక్షల మ్యాట్లు, టీ–షర్టులు పంపింది. ప్రస్తుతం వాటి డీకోడింగ్ జరుగుతోంది. అయితే పాల్గొనే వారి సంఖ్యను ఐదు లక్షలకు పెంచడంతో మరో మూడు లక్షల మ్యాట్లు, టీ–షర్టులు అదనంగా అవసరమయ్యాయి. ఒక్కో మ్యాట్ ఖరీదు రూ.340 చొప్పున ఈ మూడు లక్షల మ్యాట్ల కొనుగోలుకే సుమారు రూ.10 కోట్లు ఖర్చవుతుంది. దీనికి తోడు కార్యక్రమంలో పాల్గొనే ఐదు లక్షల మందికి అందించే స్నాక్స్ ప్యాకెట్(కేక్, బిస్కెట్, అరటిపండు, వాటర్ బాటిల్, గ్లూకోజ్ ప్యాకెట్) కోసం మరో రూ.5 కోట్లు అవసరం. ఈ అదనపు భారాన్ని ఎవరు మోయాలన్న దానిపై స్పష్టత కొరవడింది. వీటికి అదనంగా ప్రధాని, వీఐపీలు, వీవీఐపీల బస, ప్రయాణ ఏర్పాట్లు, వేదికల నిర్మాణం వంటి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ప్రతిష్టాత్మక కార్యక్రమానికి సమయం దగ్గర పడుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో, ఇంత పెద్ద కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలా అని జిల్లా యంత్రాంగం తలలు పట్టుకుంటోంది.

2 కిలోమీటర్లు.. 12 కంపార్ట్‌మెంట్లు..!

- కాళీమాత టెంపుల్, పార్క్ హోటల్ మధ్య 'యోగాంధ్ర ప్రధాన వేడుక'
- వర్షం పడితే ప్రధాన వేదిక.. ఏయూ ఇంజినీరింగ్ గ్రౌండ్‌కు మార్పు
- ప్రధాన వేదిక కార్యక్రమం ఏర్పాట్లపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ సమీక్ష

ఎంవీపీకాలనీ : యోగాంధ్ర కార్యక్రమానికి సమయం సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లపై దృష్టిసారించారు. ప్రధాన వేదికతో పాటు మేజర్‌గా కార్యక్రమాన్ని నిర్వహించనున్న బీచ్‌రోడ్డులో పరిస్థితులపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఆర్కే బీచ్‌లోని ఖాళీమాత ఆలయం నుంచి పార్క్ హోటల్ వరకు విస్తరించిన ప్రాంతంలో ప్రధాన కార్యక్రమం నిర్వహించనున్నారు. 2 కి.మీ.. 12 కంపార్ట్‌మెంట్‌లుగా ఈ ప్రాంతాన్ని విభజించారు. ప్రతి కంపార్ట్‌మెంట్‌లో వెయ్యి మంది ఉండేలా కార్యాచరణ రచించారు. ప్రధానంగా ఈ 12 కంపార్ట్‌మెంట్‌ల్లో 15 వేల మంది వరకు ఉండనున్నారు. కాళీమాత ఆలయం వద్ద ఏర్పాటు కానున్న వేదికపై ప్రధాని పాల్గొనున్నారు. ఒక వేళ వర్షం పడితే ప్రధాన వేదికను ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలోకి మార్పు చేయనున్నారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు అక్కడ వేగంగా జరుగుతున్నాయి. ప్రధాన వేదిక ఇన్‌చార్జి, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆదివారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. కంపార్ట్‌మెంట్ల ఇన్‌చార్జులు, ఇతర అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.

ప్రతి కంపార్ట్‌మెంట్‌కు ఒక గెజిటెడ్ ఆఫీసర్

ప్రతి కంపార్ట్‌మెంట్‌కు ఒక గెజిటెడ్ ఆఫీసర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమిస్తున్నారు. దీంతో పాటు 10 మంది వలంటీర్లు ఆ కంపార్ట్‌మెంట్‌లో ఉంటారు. 3 కంపార్ట్‌మెంట్‌లను అనుసంధానం చేస్తూ 20 బెడ్లతో కూడిన వైద్య శిబిరాన్ని అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో పాటు తాగునీరు, శానిటేషన్, పోలీసులు ఇలా ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో అందుబాటులో ఉంటారు. కంపార్ట్‌మెంట్‌లకు ప్రజలు చేరుకున్న అనంతరం వారికి టీషర్ట్, క్యూఆర్ కోడ్ వివరాలు అందజేస్తారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ వారు సాంకేతికత సాయంతో లెక్కింపు చేసేలా ఏర్పాటు చేశారు.

పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

కాళీమాత ఆలయం నుంచి పార్క్ హోటల్ వరకు 2 కి.మీ పరిధిలో నిర్వహించే ప్రధాన కార్యక్రమంలో పాల్గొనే వీఐపీల వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీఎంఆర్‌డీఏ డెక్, ఏయూ ఫుట్‌బాల్ మైదానంలో వాహనాలను పార్కింగ్ చేయాల్సి ఉంటుంది. వారిని అక్కడి నుంచి ఏపీ ఐఐసీ మైదానానికి ప్రత్యేక వాహనాల్లో తరలిస్తారు. ఉదయం 4.30కు వీఐపీలు అంతా వీఎంఆర్‌డీఏకు చేరుకోవాలని ఆదేశాలిచ్చారు.

విశాఖ చేరుకున్న మంత్రులు


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న మంత్రులు

మహారాణిపేట: రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, కొల్లు రవీంద్ర ఆదివారం సాయంత్రం నగరానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో మంత్రులకు సమాచార పౌరసంబంధాల శాఖ ప్రాంతీయ సంచాలకుడు వి.మణిరాం, డి.డి. డి.రమేష్, గృహ నిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్.సత్తిబాబు, సంస్థ అధికారులు స్వాగతం పలికారు.

తీరంలో సందడి



బీచ్‌రోడ్డు ఆదివారం సాయంత్రం పర్యాటకులతో కిక్కిరిసింది. ఎక్కడ చూసినా జన సందోహమే కనిపించింది. బీచ్‌లో యువకులు, చిన్నారులు, మహిళలు కేరింతలు కొడుతూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్

మినిస్కస్ రక్షణే కీలకం

నగర పోలీస్ కమిషనర్, డాక్టర్ శంఖబ్రత బాగ్చీ

మహారాణిపేట: మినిస్కస్‌ను కాపాడుకోవడంపైనే ఆర్థోపెడిక్ వైద్యులు దృష్టి సారించాలని నగర పోలీస్ కమిషనర్, డాక్టర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. ఫిజియోథెరపీ వంటి చికిత్సలతో కొంతవరకు మినిస్కస్‌ను కాపాడవచ్చని, ఒక వేళ పూర్తిగా తొలగించాల్సిన పరిస్థితి వస్తే భవిష్యత్తులో ఆస్టియో ఆర్థరైటిస్ త్వరగా వస్తుందని ఆయన హెచ్చరించారు. కిమ్స్ ఆస్పత్రి సీతమ్మధార ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థ్రోస్కోపీ శస్త్రచికిత్సల్లో అత్యాధునిక విధానాలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. 'అమెరికాలో ఒక్కో వేలికి శస్త్రచికిత్స చేయడానికి కూడా ప్రత్యేక నిపుణులున్నారు. ఇక్కడ మినిస్కస్‌కు ఆర్థ్రోస్కోపీ చేయడం చాలా సంతోషాన్నిచ్చింది' అని అని అన్నారు. కేవలం ఉత్తరాంధ్ర నుంచే కాకుండా, గోదావరి జిల్లాలు, ఒడిశా, చత్తీస్‌గఢ్ నుంచి కూడా రోగులు నగరానికి వస్తుంటారని, వారందరికీ ఈ అత్యాధునిక చికిత్సా విధానాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని చెప్పారు. ఇలాంటి వర్క్‌షాప్‌లకు హాజరుకావడం ద్వారా వైద్యుల విజ్ఞానం మరింత పెరుగుతుందని, ముఖ్యంగా పీజీ విద్యార్థులకు ఇవి ఒక వరంలాంటివని డాక్టర్ బాగ్చీ అభిప్రాయపడ్డారు. వైద్యులకు ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా తనకు కాల్ చేయవచ్చని లేదా వాట్సాప్‌లో మెసేజ్ పంపినా అండగా ఉంటానని సీపీ భరోసా ఇచ్చారు.

యువతనూ వెంటాడుతున్న మోకాళ్ల అరుగుదల



మాట్లాడుతున్న వైజాగ్ ఆర్థ్రోస్కోపిక్ అసోసియేషన్ కార్యదర్శులు శ్రీనివాస్, రాజేష్ కుమార్ రెడ్డి, సంతోష్

మహారాణిపేట: జీవనశైలి లోపాలు, ఊబకాయం, అధిక శరీర బరువు, రోడ్డు ప్రమాదాలు, క్రీడల్లో జరిగే ప్రమాదాల కారణంగా చిన్న వయసు వారిలోనూ మోకాళ్ల అరుగుదల ఎక్కువగా కనిపిస్తోందని వైజాగ్ ఆర్థ్రోస్కోపిక్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శులు డాక్టర్ గొల్లంగి శ్రీనివాస్, డాక్టర్ రాజేష్ కుమార్ రెడ్డి తెలిపారు. సాధారణంగా 60–70 ఏళ్ల దాటిన తర్వాత కనిపించే ఈ సమస్య, పలు కారణాల వల్ల ప్రస్తుతం 20–40 మధ్య వయసు వారిలో కూడా అధికంగా కనిపిస్తోందన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మోకాలిలో ఉండే లిగమెంట్లు, మినిస్కస్ గాయాలైనప్పుడు వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. లేనిపక్షంలో దీర్ఘకాలంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. డాక్టర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ ఈ తరహా గాయాలను ఆర్థ్రోస్కోపీ ద్వారా నయం చేయవచ్చని, అందులోనూ అత్యాధునిక సాంకేతికతలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. విశాఖపట్నంలోని కిమ్స్ ఆస్పత్రి (సీతమ్మధార) ఆధ్వర్యంలో నార్త్ ఆంధ్ర ఆర్థోపెడిక్ అసోసియేషన్, వైజాగ్ ఆర్థ్రోస్కోపిక్ అసోసియేషన్ సహకారంతో ఆర్థ్రోస్కోపీ శస్త్రచికిత్సల్లో వస్తున్న అత్యాధునిక విధానాలపై సదస్సు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుకి ఉత్తరాంధ్ర వ్యాప్తంగా 150 మందికిపైగా ఆర్థోపెడిక్ వైద్యులు హాజరయ్యారు. అహ్మదాబాద్‌లోని అడ్వాన్స్ ఆస్పత్రి డైరెక్టర్ ప్రతీమేష్ జైన్, అహ్మదాబాద్‌కు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ రోహన్ వక్త, కోయంబత్తూరులోని ఆర్థోవన్ ఆస్పత్రికి చెందిన వైద్యనిపుణుడు డాక్టర్ సంతోష్ సహానంద్ తదితరులు మోకాలికి సంబంధించిన వివిధ రకాల సమస్యలు, వాటిని నివారించే మార్గాలు, పరిష్కార సాంకేతికతల గురించి వివరించారు. ప్రతి ఒక్కరికీ తగిన శారీరక వ్యాయామం అవసరమని, రోజుకు కనీసం 3 నుంచి 5 కిలోమీటర్లు నడవడం ద్వారా చాలా వరకు సమస్యలను నివారించవచ్చని వైద్యులు సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ సంతోష్ ఆర్. గద్దం తదితరులు పాల్గొన్నారు.

విత్తన బంతులతో పచ్చదనం


సీతమ్మధార హనుమాన్ ఆలయ సమీపంలోని కొండపై విత్తన బంతులు విసురుతున్న ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: పచ్చని వనాలను పెంచడానికి విత్తన బంతులు ఒక అద్భుతమైన మార్గమని పర్యావరణ సంరక్షణ గతివిధి సంస్థ విశాఖ పర్యావరణ సంయోజక్ డా.ఎస్పీబీ రంగాచార్యులు అన్నారు. సీతమ్మధార కొండపైన ఆదివారం పర్యావరణ సంరక్షణ గతివిధి, వనమాలి, సీటీజీ, ప్లాంట్ ఎ హోప్, జేడీ ఫౌండేషన్, రోటరీ, ఐఐఏఎం, వుమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ సొసైటీ, గ్రీన్ క్లైమేట్ టీం వంటి స్వచ్ఛంద సంస్థలు కలిసి విత్తన బంతులు విసిరే కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ సందర్భంగా డా.రంగాచార్యులు మాట్లాడుతూ వాతావరణ మార్పులను నిరోధించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మనం తిన్న పండ్ల విత్తనాలను సేకరించి, ఆరబెట్టి, ఆ తర్వాత పేడ, మట్టి, బూడిదతో కలిపి విత్తన బంతులుగా తయారుచేయాలని సూచించారు. వర్షాకాలంలో ఈ విత్తన బంతులను కొండలు, నదీతీరాలు, సముద్రతీర ప్రాంతాలు, చెరువు గట్లపై చల్లడం ద్వారా పచ్చదనాన్ని పెంచవచ్చని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయకపోతే భవిష్యత్ తరాలు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సమాజ సేవకులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరి దుర్మరణం

మద్యం మత్తులో ఆటో నడపడంతో ప్రమాదం


ఘటనా స్థలంలో సురేష్ మృతదేహం

గాజువాక: మద్యం మత్తులో ఆటో నడపడంతో ఒక వ్యక్తి ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. అతడితో పాటు ప్రయాణిస్తున్న మరో నలుగురు వ్యక్తులు అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాజువాక ట్రాఫిక్ పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక ప్రశాంతినగర్‌కు చెందిన బలగం సురేష్ (26) పీవీసీ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నాడు. స్నేహితులు లోకేష్, దుర్గాప్రసాద్‌తోపాటు మరో ఇద్దరితో కలిసి చినగంట్యాడలో మందు పార్టీ చేసుకున్నారు. అప్పటికే బాగా తాగి ఉన్న ఆ ఐదుగురు వ్యక్తులు ఎస్‌ఏడీ జంక్షన్‌లో వేరే పార్టీ కోసం ఆటోలో బయలుదేరి వెళ్తున్నారు. ఆ ఆటోను ఐదుగురిలో ఒకడైన లోకేష్ నడుపుతున్నాడు. పంతులుగారి మేడ జంక్షన్‌కు వెళ్లేసరికి ఆటో అకస్మాత్తుగా తిరగబడిపోయింది. ఈ సంఘటనలో నలుగురు వ్యక్తులు బయటకు తుళ్లిపోగా, సురేష్‌పై ఆటో పడిపోయింది. దీంతో అతడు సంఘటనా స్థలంలోనే దుర్మరణం పాలయ్యాడు. మిగిలిన నలుగురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఇదేనా మనమిచ్చే గౌరవం?

క్రీడలు, సాహిత్యం, రాజకీయాలు, కళలు వంటి రంగాల్లో దేశానికి గర్వకారణంగా నిలిచిన ఎందరో మహానుభావుల విగ్రహాలను విశాఖ సాగరతీరంలో ఏర్పాటు చేశారు. ఇవి నగరానికి ప్రత్యేక ఆకర్షణగా మారాయి. యువతకు నిత్యం ప్రేరణగా నిలుస్తున్నాయి. ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం బీచ్ రోడ్డును ముస్తాబు చేసే క్రమంలో భాగంగా అధికారులు ఈ విగ్రహాలకు రంగులు వేయిస్తున్నారు. నిచ్చెనలు వేసుకుని విగ్రహాలకు రంగులు వేయాల్సిన కార్మికులు.. వారి విలువ, ప్రాధాన్యం తెలియక ఆ విగ్రహాలపై నిల్చొని పైకప్పును శుభ్రం చేయడం, రంగులు వేయడం నగరవాసుల మనసులను కలచి వేస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి, మహనీయులకు సముచిత గౌరవం దక్కేలా చూడాలని.. రంగులు వేసే ప్రక్రియను గౌరవప్రదంగా పూర్తి చేయించాలని కోరుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



